www.epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

సామాన్యుల గళం

తెలుగు దినపత్రిక

సంపుటి - 18 | సంచిక 94 | ఎడిటర్ : వి. విక్రం కుమార్ | గురువారం 05, డిసెంబర్ 2024 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు 8 | వెల రూ. 5

**ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం**

లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధం
పారదర్శకంగా ఎంపికకు మొబైల్ యాప్
రేపు (5వ తేది) గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ
6వ తేది నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్
రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

3

**గంజాయితో పాటు నగదు స్వాధీనం**

నలుగురిపై కేసు నమోదు, ఇద్దరి అరెస్టు
రూ.9 లక్షల జరిమానా
చెల్లించిన నిందితురాలు

2

## గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం పటిష్టం : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4 (సమయం న్యూస్): గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కఠినంగా ఉందని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2023 మేలో గూండా చట్టం కింద పెండింగ్‌లో ఉన్న విచారణలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిటిషన్ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వ స్పందన కోరింది. దీంతో గ్యాంగ్‌స్టర్ చట్టం కింద పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాదులు గౌరవ్ అగర్వాల్, తన్వి దూబే వాదనలు వినిపించారు. యూపీ గ్యాంగ్‌స్టర్ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎఫ్ఐఆర్ నిరాధారమని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ ఆరోపించారు. పిటిషనర్‌పై గ్యాంగ్‌స్టర్ల చట్టాన్ని వర్తింపజేయడం పక్షపాతంతో కూడుకున్నదని, ఇది పోలీసు, న్యాయ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. బుధవారం పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తొలుత 1986 చట్టంలోని సెక్షన్ల కింద అక్రమ మైనింగ్ కేసు నమోదు చేశారని.. ఒకే అభియోగంపై రెండుసార్లు కేసు నమోదైందన్నారు. గూండా చట్టాన్ని విమర్శించిన ధర్మాసనం దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా కోర్టు విచారిస్తుందని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు హైకోర్టులో పిటిషనర్ తరఫు న్యాయవాది గ్యాంగ్‌స్టర్ చట్టం కింద నమోదైన కేసులో తనను ఇరికించారని వాదనలు వినిపించారు. పిటిషనర్ పేరు లేని మరో కేసు ఆధారంగానే గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.



## ఏషియా పసిఫిక్ జోన్లో రెండో సెంటర్

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్
తెలంగాణలో పెట్టుబడులకు కుదిరిన ఒప్పందం
గూగుల్‌తో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం
సీఎం రేవంత్ నివాసంలో కంపెనీ ప్రతినిధి బృందం భేటీ
డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజ
గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా ఉంది
ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ హైదరాబాద్ మేటి
ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

తెలంగాణ ప్రభుత్వం దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ ముందుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ని హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది కాగా, ఏషియా పసిఫిక్ జోన్లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ కావడం విశేషం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ అనేది ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్ . ఈ సేఫ్టీ సెంటర్ అధునాతన భద్రతతో పాటు ఆన్‌లైన్ సేఫ్టీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, రీసెర్చర్లకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా మారనుంది.

6



## రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్

హైదరాబాద్, డిసెంబర్ 4 (సమయం న్యూస్):



రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితుల య్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

**సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం**

**శ్రీహరికోట,డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల,డిసెంబర్ 4 (సమయం న్యూస్):**



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 60,301 మంది భక్తులు దర్శించుకోగా 20,222 మంది తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.32 ఆదాయం వచ్చిందన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు గోవర్ధనగిరిధారియైన శ్రీ కృష్ణుని అలంకారంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు.

## డిసెంబరు 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**కర్నూలు, డిసెంబరు 04 (సమయం న్యూస్):-**

డిసెంబరు 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యా శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఏర్పాట్లపై ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఎంఈఓలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రాధాన్యత నిస్తోందని, అందువల్ల ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి 13 కమిటీలను ఏర్పాటు చేశారా? విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించారా?అన్ని పాఠశాలలకు పిల్లల విద్య పురోగతి కి సంబంధించి ఆన్లైన్ లో చూసుకునేలా రూపొందించిన హోలిస్టిక్ కార్డ్స్, ప్రోగ్రెస్ కార్డ్స్ అందాయా? అన్ని ఏర్పాట్లు చేశారా అని కలెక్టర్ అన్ని మండలాల ఎంఈఓ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు అందరూ ఒకే చోట కార్యక్రమానికి హాజరుకాకుండా ఒక్కొక్కరు ఒక పాఠశాలలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని డిఈఓకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఆహ్లాద కరమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు..అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డిఈఓ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.



## మేడారంలో ప్రకృతి ప్రకోపం

**లక్ష చెట్లు విరిగినా..95 రోజుల్లో భూకంపం**

5



www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం తెలుగు దినపత్రిక

# సంపాదకీయం


## పుష్ప2తో దేశమంతా ఊగిపోతోంది..ఎందుకీ క్రేజ్?



సినిమా అత్యంత ప్రభావవంతమైన మాధ్యమం. ప్రాథమికంగా ఇది వినోద ప్రధానమైనది. కానీ, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సినిమా అద్దం పడుతుంది. ఒక దేశ సంస్కృతి, ప్రజల జీవన పరిస్థితులకు దర్పణం. కాలానికి అనుగుణంగా, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా సినిమాలు రూపొందుతాయి. అన్ని రంగాల మాదిరిగానే సినీ రంగంలో కూడా జనరేషనల్ షిఫ్ట్ ఉంటుంది. దానిని అందుకున్న వారే విజయవంతమవుతారు. ఇప్పటి వరకు మనం రెండు రకాల సినిమాలను చూశాం. అవి వాస్తవిక చిత్రాలు, కాల్పనిక చిత్రాలు. వీటినే ఆర్ట్ సినిమా, కమర్షియల్ సినిమా అని అంటుంటాం. ఇక, ప్రపంచానికి ఇండియన్ సినిమా అంటే బాలీవుడ్. కానీ ఇప్పుడు ఆ చిత్ర పరిశ్రమ ప్రతిష్ట మసకబారుతోంది. దానికి కారణం దక్షిణాది సినిమాల ప్రభావం. భారీ తనంలో హిందీ సిని మా తక్కువేమీ కాదు..కానీ ప్రేక్షకులను మెప్పించటంలో విఫలమవుతున్నాయి. ఏడాదికి ఒకటి రెండు మినహా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతున్నాయి. కాగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న తెలుగు సినిమా పుష్ప2పై దేశ వ్యాప్తంగా ఊహకందని అంచనాలు నెలకొన్నాయి. దక్షిణాది రాష్ట్రాలే కాదు.. బీహార్ సహా యావత్ ఉత్తర భారతదేశం అల్లు అర్జున్ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హిందీ వెర్షన్ అడ్వాన్స్ బుకింగ్‌లో 24 గంటల్లోనే లక్ష టికెట్స్ అమ్ముడయ్యాయంటేనే దీని క్రేజ్ ఏమిటో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో అయితే బుకింగ్ ఓపెన్ అయిన గంటలోనే ఫస్ట్‌డే టికెట్స్ మొత్తం అమ్ముడయ్యాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు సౌత్ నార్త్ ఓవర్సీస్ లో ఏ సెంటర్ చూసినా పుష్ప 2 రికార్డులు ఇపుడు హాట్ టాపిక్. 670 కోట్లకు పైగా థియేట్రికల్ బిజినెస్ అయింది. ఆడియో రైట్స్, డిజిటల్ రైట్స్, ఓటిటి రూపంలో 400 కోట్లు వచ్చినట్టు ఇండస్ట్రీ టాక్. ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమా కూడా ఈ రేంజ్ లో బిజినెస్ చేయలేదు . దాదాపు 1060 కోట్ల బిజినెస్ తో సరికొత్త ట్రెండ్‌ని సెట్ చేస్తోంది. సుమారు 12 వేల 500పైగా థియేటర్లలో విడుదలకాబోతంది. ప్రపంచ వ్యాప్తంగా మొదటి రోజే దాదాపు 55 వేల వేల షోస్ పడుతున్న మొట్టమొదటి తెలుగు సినిమా పుష్ప 2 కావడం విశేషం. 80 దేశాల్లో ఆరు భాష ల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఫస్ట్ డే కలెక్షన్ ప్రపంచ వ్యాప్తంగా 250- 270 కోట్లు ఉంటుందని బాక్సాఫీస్ పండితుల అంచనా. ఈ నెల 5న 'పుష్ప'రాజ్ థియేటర్స్‌లో అడుగుపెడుతున్నాడు. పుష్పతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఆ చిత్రం ద్వారా జాతీయ ఉత్తమ నటుడు అవార్డు కూడా గెలుచు కున్నారు. ఆ తరంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, చిరంజీవి, ఈ తరంలో ఏ తెలుగ హీరో ఆ అవార్డు దక్కించుకోలే కపోవటం గమనార్హం. పుష్ప రాజ్ పాత్ర ద్వారా అల్లు అర్జున్‌కు వచ్చిన క్రేజ్ ఇప్పుడు ఈ సినిమాకు ఈ స్థాయిలో రెస్పాన్స్ రావటానికి ఒక కారణం. అలాగే బాలీవుడ్ సినిమాల పట్ల ఉత్తారాది ప్రేక్షకులలో నెలకొన్న స్తబ్ధత మరో కారణం. .నిజానికి ఈ క్రేజ్ ఊహించనిదేమీ కాదు. చేతిలో చిల్లిగవ్వ లేని దశనుంచి వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగే పాత్ర పుష్ప రాజ్ . సహజంగా ఇలాంటి రోల్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకునే హీరోయిక్ అండ్ ఎమోషనల్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. సగటు సినిమా అభిమాని కోరుకునేది ఇదే. ఇలాంటి పాత్రలు..సినిమాలు ఇప్పుడు బాలీవుడ్ లో కరువయ్యాయి. వాటి కోసం ప్రేక్షలు మొహం వాచిపోయి ఉన్నారు. ఈ గ్యాప్ ని దక్షిణాది సినిమా బర్తీ చేస్తోంది. అందుకే భాషా బేధం లేకుండా ఉత్తరాది వారు కూడా వాటిని ఆదరిస్తున్నారు. టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ వంటి మాస్ హీరోలు యాక్షన్, రొమాన్స్‌తో అలరించినా .. వారి పాత్రల్లో సగటు భారతీయ సినిమా హీరో పడే కష్టాలు, కన్నీళ్లు కనిపించవు. దీనికి భిన్నంగా పుష్పలో అల్లు అర్జున్, కేజీఎఫ్ లో యష్ ధరించిన పాత్రలను చూడవచ్చు. వారు ప్రేక్షకుడిని సరిగ్గా ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టారు. ఆయా పాత్రలు రోజువారీ ప్రేక్షకులు తమను తాము చూసుకునేలా ఉంటాయి. పుష్ప: ది రైజ్‌లో, అల్లు అర్జున్ సెల్ఫ్ మేడ్ క్యారెక్టర్ అటువంటిదే. అతని అక్రమార్జన, తిరుగుబాటు వైఖరి, లోతైన భావోద్వేగం 'రాగ్స్ టు రిచ్స్' ఫార్ములాకు తిరిగి జీవం పోసాయి. పుష్ప 2 దీనిని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళుతుందని హామీ ఇచ్చింది.


# ఏపీ ప్రజలకు సంక్రాంతి కానుక ఇదే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరో భారీ శుభవార్త చెప్పను న్నారు. సంక్రాంతి కానుకగా మరో సంచలన పథకాన్ని అమలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతి సారీ సంక్రాంతి వచ్చిందంటే చాలు రాష్ట్ర ప్రజలకు ఏదో ఒక రూపంలో కానుకలు అందించేవారు. అయితే ఈ సారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టిన కూటమి మరికొద్ది రోజుల్లో రానున్న సంక్రాంతికి ఎటువంటి కానుకలు ఇవ్వనుందో అని ప్రజలలో లోనూ ఆసక్తి నెలకొంది.కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రజలు కూటమి మేనిఫెస్టోలో ఉన్న వాటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశారు.ఈ తరుణంలో వచ్చే సంక్రాంతికి ఏ పథకాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ అమలు చేయబోతోందోనని ప్రజలు వేయి కళ్లతో చూస్తున్నారు. అయితే గతంలో కూటమి సర్కార్ ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం దీనికి సంబంధించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ పథకాన్ని సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో అమలు చేస్తే మహిళలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ పథకాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.మరోవైపు ఈ పథకానికి సం బంధించి ప్రభుత్వం ఇప్పటికే పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో ప్రత్యేక బృందాల ద్వారా అధ్యయనం చేసి డీటెయిల్డ్ రిపోర్ట్ తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయడా నికి కావాల్సిన విధివిధానాలు, ఏ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి, ఆర్టీసీపై పడే భారం, రాష్ట్ర ఖజానాపై పడే భారాలపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం.రాష్ట్రంలోని పలువురు మంత్రులు ఇదివరకే ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. త్వరలోనే ఈ పథకానికి కావాల్సిన, అవసరమైన నిధులు, కేటాయిం చాల్సిన బస్సులు వంటి వాటిపై ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వం చర్చలు జరిపే అవకాశం ఉంది. అయితే సంక్రాంతికి కూటమి సర్కార్.. ఉచిత బస్సు పథకం మే కాకుండా తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500 ఆర్థిక సాయం పథకాల్లో ఏదో ఒకదానిని అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకాల అమలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వీలైనంత త్వరగా ప్రభుత్వం వీటిని అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఈ పథకాలు అమలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు భారీ లబ్ధి చేకూరనుంది.



# ఇక పిల్లాడికి పెళ్లవుతుందా? మారుతున్న అమ్మాయిల ఆలోచనలు

ఎనబయ్యో దశకం వరకు మగపిల్లలకి పెళ్లి కావాలంటే కనీసం ప్రభుత్వ ఉద్యోగమో, టీచరు లేదా బ్యాంక్ జాబో ఉండాల్సిన పరిస్థితి. దాంతో పాటూ అబ్బాయిల వైపు నుంచి కట్నకానుకల డిమాండ్స్ ఎలాగూ ఉంటాయి. అదే తొంబైల తర్వాత గాలి అమెరికా వైపుకు వీయడం మొదలు పెట్టింది. అమ్మాయిల ఆలోచనల్లో ఇండియాలోనే ఉండే పెద్ద ఉద్యోగం వాడికంటే అమెరికా భర్త అయితే బాగుంటుందని కోరుకోవడం ఎక్కువయ్యింది. దాంతో ఎన్నారై మ్యాచ్‌లకు గిరాకీ పెరిగింది. కట్నాలు కూడా దానికి తగ్గట్టే ఉండేవి. క్రమంగా రోజులు మారుతూ వచ్చాయి. గల్లీకొ పిల్లడు అమెరికాలో ఉండడం వల్ల, కేవలం ఎన్నారై స్టాటస్ కాకుండా, అబ్బాయికి ఆస్తిపాస్తులుం టేనే పెళ్లికి రెడీ అంటున్నారు అమ్మాయిలు. అబ్బాయిల సంఖ్య పెరిగి, అమ్మాయిల సంఖ్య తగ్గడంతో కట్నాల డిమాండ్స్ కూడా తగ్గుతూ వచ్చాయి. 'మంచి అమ్మాయి దొరికితే చాలు.. కట్నాలక్కర్లేద'నే రోజులు వచ్చాయి. దాంతో అమ్మాయిలకే డిమాండ్ పెరిగింది. కట్నాలు డిమాండ్ చేసే అబ్బాయిలు తగ్గారు. తెలియని వాళ్లకి ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ, అబ్బాయిల పెళ్లిళ్ల కోసం వధువుని వెతుక్కుంటూ మ్యాట్రిమోనీ సైట్లల్లో తొంగిచూసే తల్లిదండ్రు లకి కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. తమ కొడుకు అమెరికాలో హెచ్ 1 బి మీద ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడని చెబితే చాలు అమ్మాయిలు క్యూ కడతారు అనుకునే వాళ్లకి చుక్కెదురవుతోం ది. కేవలం అమెరికా ఉద్యోగం సరిపోదంటున్నారు అమ్మాయిలు. ఫ్యామిలీ ఫైనాన్షియల్ స్టాటస్ లోనూ, చదువులోనూ, అందచందాల్లోనూ జస్ట్ యావరేజ్ అనిపించే అమ్మాయిలు అమెరికాలోనూ, ఇండియాలోనూ సొంత ఇళ్లు ఉండాలంటున్నారు. లేదా కనీసంలో కనీసం 10-15 ఎకరాల పొలమైనా ఉండాలట. ఈ తరహా అమ్మాయిల తల్లిదండ్రుల్లో చాలామందికి సొంత ఫ్లాట్ కూడా ఉండట్లేదన్నది ఇక్కడ కఠిన వాస్తవం. అబ్బాయిల తల్లిదండ్రులు నచ్చిన సంబంధం కోసం ఒక ఏడాది కాలయాపన చేసి వెనక్కి వచ్చి చూస్తే ఈ రకం అమ్మాయిల్లో సగం మందికి పెళ్లిళ్లు కుదిరిపోతున్నాయి. అంటే వాళ్లకి కావాల్సిన వరులు దొరికేస్తున్నారని అనుకోవాలి. ఇక కొద్దో గొప్పో ఆస్తి ఉండి, అందచందాలు కూడా ఉంటే ఇక ఆ అమ్మాయిల కోరికలు అన్నీ ఇన్నీ కావు. పదుల కోట్లల్లో ఆస్తులు, విల్లాలు, అమెరికాలో టాప్ యూనివెర్సిటీ బ్యాక్ గ్రౌండ్ ఉండి టాప్ లెవెల్లో జాబ్ ఉన్న అబ్బాయిలు మాత్రమే కాకుండా, కచ్చితంగా గ్రీన్ కార్డ్ వాళ్లు కావాలని కోరుకుంటున్నారు. ఆ రేంజ్ అబ్బాయిలు కూడా ఇలాంటి వాళ్ల కోసం వెతుక్కుని వచ్చి పోటీ పడి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. లవ్ మ్యారేజీలైతే ఓకే కానీ, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలంటే ఆ పెద్దలకి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక ఇప్పుడు పరిస్థితి మరీ కఠినంగా మారుతోంది. ట్రంప్ ప్రమాణస్వీకారం తర్వాత అమెరికాలో సీన్ మారుతోంది. హెచ్ 1 బి శాశ్వతంగా ఎత్తేస్తున్నాడని టాక్. అలాగే టాప్ యూనివర్సిటీల్లో సీట్ పొంది మెరిట్లో పాసైన విద్యార్థులకి మాత్రం సత్వరం గ్రీన్ కార్డ్ ఇచ్చేస్తానంటున్నాడు. అంటే వాళ్లకి తప్ప ఎ-క్లాస్ అమ్మాయిలు దొరికే పరిస్థితి ఉండదు ఇండియన్ మ్యారేజ్ మార్కెట్లో. క ఇందాక చెప్పుకున్న యావరేజ్ అమ్మాయిల పరిస్థితి కూడా మారనుంది. వాళ్ల కోరికలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి రాబోతోంది. ఎన్నారై సంబంధాలే కావాలంటే కుదరదు. ఎందుకంటే హెచ్ 1 బి లేకపోతే ఎన్నారై పెళ్లికొడుకులే తగ్గిపోతారు కాబట్టి. ఉన్నంతలో ఇండియాలోనే పెద్ద ఉద్యోగం, మంచి సంపాదన ఉన్నవాళ్లని వెతుక్కోవచ్చు. అమ్మాయిల్లో ఈ కాంప్రమైజ్ వల్ల అబ్బాయిలకి పెళ్ళిళ్లు ఈజీగా అవుతాయా అంటే చెప్పలేం. ఎందుకంటే మారిన సినారియోలో ఇండియాలో నిరుద్యోగులు పెరిగే అవకాశాలున్నాయి. కొద్దో గొప్పో ఉద్యోగాలుంటేనే పరిస్థితి కష్టంగా ఉంటే, ఇక ఉద్యోగం లేని అబ్బాయిల్ని చేసుకునేదెవరు? ఆస్తులుంటే కాస్త పర్వాలేదనుకోవాలి. అందుకే ఈ పరిస్థితిని దాటాలంటే అమెరికాని వదిలేసి మరో దేశాన్ని వెతుక్కోవాలేమో భారతీయ యువకులు. అలా అనుకుందామనుకున్నా అమెరికా తర్వాత డిమాండ్ ఉన్న దేశం కెనెడా. అక్కడ జాబ్ మార్కెట్ అమెరికా అంత స్ట్రాంగ్ కాదు. ఆ తర్వాత యూకే. అది ఆల్రెడీ ఇబ్బందుల్లో ఉంది. అసలక్కడ చదివిన ఏ భారతీయుడైనా తిరిగి ఇంటికొస్తున్నాడే తప్ప అక్కడ జాబ్ పొందడం చాలా కష్టంగా ఉంది. ఇక మిగిలింది ఆస్ట్రేలియా. అక్కడ కూడా జాబ్ వీసాలు కఠినమయ్యాయి. మరి ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న భారతీయ యువ జనాభాకి ప్రపంచంలో మంచి చోటెక్కడ అనేది ప్రశ్న. దీనికి కాలమే సమాధానం చెప్పాలి.



# వణికిన గద్దెలు

### 7.27 గంటలకు స్వల్పంగా కంపించిన భూమి

**ములుగు, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

సమ్మక్క-సారక్క గద్దెలు వణికిపోయాయి. బుధవారం ఉదయం మేడారంలో ఆ తల్లులు గద్దెలపై ఉన్న ఇనుప గ్రిల్స్ కూడా ఉగిపోయాయి. ములుగు జిల్లాలో ఇవాళ ఉదయం 7.27 నిమిషాలకు భూమి కంపించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో భూమి కంపించింది. సారక్క గద్దె వద్ద ఉన్న కెమెరాకు .. భూ ప్రకంపనలు చిక్కాయి. భూమి ప్రకంపించిన సమయంలో గద్దె వద్ద ముగ్గురు ఉన్నారు. ఓ వ్యక్తి గద్దె వద్ద కూర్చుని పూజ చేస్తుండగా, మరో వ్యక్తి అతని సమీపంలో నిలబడ్డారు. ఓ మహిళ కూడా ఆ గద్దె వద్దే ఉన్నది. భూమి కంపిస్తున్న సమయంలో.. ఆ ముగ్గురూ కొంత ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో వాళ్లకు అర్థం కాలేదు. కొద్ది సేపు అటూ ఇటూ చూశారు. తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో.. గద్దెల చుట్టు ఉన్న గ్రిల్స్ ఊగినట్లు సీసీకెమెరాల ద్వారా స్పష్టమైంది. కెమెరాలు వణికిపోవడంతో.. అక్కడ భూమి కంపించినట్లు అర్థమైంది.

# పెద్దపల్లిలో ముందస్తు అరెస్టు

**హైదరాబాద్, డిసెంబర్ 4(సమయం న్యూస్):**

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్‌తో పాటు మరో 20 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులపై స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు మరో 15 మందిని అరెస్టు చేశారు. అలాగే బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ కొయ్యాడ సతీశ్‌తో పాటు మరో 20 మంది విద్యార్థి నాయకులను పెద్దపల్లిలో అరెస్టు చేశారు. రామగుండంలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేశారు.

# నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్, డిసెంబర్ 4(సమయం న్యూస్):**



కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. లగచర్ల దాడి ఘటనలో ఏ1గా ఉన్న పట్నం నరేందర్ రెడ్డి.. కొడంగల్ కోర్టు రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ వేశారు. లగచర్ల ఘటనలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరారు. పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు దాన్ని తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌పై కింది కోర్టు విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

# ఢిల్లీలో మెరుగుపడుతున్న గాలిలో నాణ్యత

న్యూఢిల్లీ : గత కొన్ని రోజులుగా తీవ్ర వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయిన ఢిల్లీ వాసులకు కాస్త ఉపశమనం లభించింది. రాజధాని ప్రాంతంలో బుధవారం గాలి నాణ్యత కాస్త మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 211గా నమోదైంది. దీన్ని మోడరేట్ కేటగిరీ కింద సూచిస్తారు. కాగా, 20 రోజుల క్రితం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 మార్క్‌ను తాకి ప్రమాదకర స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఈ వారం మరింత తగ్గుముఖం పట్టింది. ఆదివారం 285, సోమవారం 273గా నమోదైన ఏక్యూఐ లెవల్స్.. మంగళవారం 268 వద్ద నిలిచిన విషయం తెలిసిందే. ఇవాళ ఇంకాస్త మెరుగుపడటంతో రాజధాని వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు ఢిల్లీలో ఇవాళ కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సీజన్ సగటు కంటే 2.5 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ ఉదయం 8:30 గంటల సమయంలో ఢిల్లీలో తేమ స్థాయి 68 శాతంగా ఉంది.

# నిలుపు మోసం చేసిన రేవంత్

### కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు కాంగ్రెస్ పబ్లిసిటీ : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**



గతంలో కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేసన్లను కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిసిటీ చేసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో యువతకు లభించింది వికాసం కాదని విలాపమే అని అన్నారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి యువతను నిలువునా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లు తామే ఇచ్చినట్లుగా కాంగ్రెస్ పబ్లిసిటీ చేసుకుంటుందని కేటీఆర్ మండిపడ్డారు. 55, 143 ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కాంగ్రెస్ బడాయి మాటలు చెబుతుందని విమర్శించారు. ఏడాదిలో కాంగ్రెస్ భర్తీ చేసింది కేవలం 12,527 ఉద్యోగాలు మాత్రమే అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగ నియమాక పత్రాలు ఇస్తూ గొప్పలు చెబుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు మరిచి.. నిరుద్యోగ యువతను మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ కు అధోగతే అని హెచ్చరించారు. కాంగ్రెస్ యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని గుర్తు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండర్ జాడ లేదు.. 2 లక్షల ఉద్యోగాల ఊసు లేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది 12,527 మాత్రమే అని తెలిపారు. కాంగ్రెస్ ఇంకా 1,87,473 ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకు బాకీ ఉందని వివరించారు. ఏరు దాటాక తెప్ప తగిలేసినట్లు, అధికారం వచ్చాక కూడా అబద్దాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. నిజం నిప్పులాంటిదని.. కాంగ్రెస్ మోసాలకు తెలంగాణ జవాబు చెబుతుందని స్పష్టం చేశారు. జాగో తెలంగాణ యువత అని పిలుపునిచ్చారు.

# తస్మాత్ జాగ్రత్త.. ఈ నంబర్ల నుంచి ఫోన్ వస్తుందా? లిఫ్ట్ చేయొద్దు



**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సెల్ ఫోన్లకు మెసేజ్ లు, కాల్స్ చేస్తూ అమాయకుల బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలను దొంగిలించే ప్రయత్నం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఇక తాజాగా సైబర్ నేరగాళ్లు మరో కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అలర్ట్ అయిన పోలీసులు విదేశీ ఫోన్ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను అనుమతించవద్దని చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. ౦94777 455913, ౦37127913091, ౦56322553736, ౦37052529259, ౦255901130460 వంటి నంబర్‌ల నుండి మీకు కాల్ వస్తే, లిఫ్ట్ చేయవద్దని సూచించారు. సైబర్ కేటుగాళ్లు ప్రధానంగా ౦371 (లాట్వియా), ౦375 (బెలారస్), ౦381 (సెర్బియా), ౦563 (ఐయోవా), ౦370 (లిథువేనియా), ౦255 (టాంజానియా) వంటి కోడ్‌లతో ప్రారంభమయ్యే నంబర్‌ల నుంచి రింగ్ చేసి, కాల్ లిఫ్ట్ చేయగానే హ్యాంగ్ చేస్తారని తెలిపారు. మీరు తిరిగి కాల్ చేస్తే, మీ కాంటాక్ట్ లిస్ట్, బ్యాంక్, క్రెడిట్ కార్డ్ వివరాలు మొదలైనవి మూడు సెకన్లలో కాపీ చేయబడే ప్రమాదంగా పెట్టుకున్నారని తెలిపారు. మీరు హ్యాష్ 90 లేదా హ్యాష్ 09 నంబర్‌లను డయల్ చేయమని ఎవరైనా సూచించినట్లయితే వారు అలా చేయవద్దని చెప్పారు. అలా చేయడం మీ సిమ్ కార్డ్‌ని యాక్సెస్ చేయడానికి, మీ ఖర్చుతో కాల్‌లు చేయడానికి అంతేకాకుండా మిమ్మల్ని నేరస్థుడిగా మార్చడానికి చేసిన కుట్రగా పరిగణించాలని తెలిపారు. కావున ప్రజలు ఈ నెంబర్, కోడ్ లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# గవర్నర్, సి.ఎమ్. లచే ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం

**ఏర్పాట్లపై శిల్పారామం లో సి. ఎస్ సమీక్ష**



**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలలో భాగంగా గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల చేతుల మీదుగా శాల్పారామంలో దాదాపు 106 షాపులతో ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శిల్పా రామంలో ఏర్పాటు చేయనున్నమహిళా శక్తి నైట్ బజార్ ను నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సందర్శించారు. ఏర్పాట్ల పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ల ను ఏర్పాటు చేయాలన్నది ముఖ్యమంత్రి సంకల్పం కావడంతో నైట్ బజార్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి కే స్టాల్ ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావడంతో వాటిని సీఎస్ పరిశీలించారు. స్టాల్ నిర్వాహకులకు, సందర్శకులకు తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. నైట్ బజార్ లో లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నైట్ బజార్ లో స్వయం శక్తి మహిళా సంఘాల చే తయారు చేయబడిన పిండి వంటకాల స్టాల్స్, హస్తకళలకు చెందిన స్టాల్స్, హహిళ లు స్వయంగా తయారు చేసిన పలు ఉత్పత్తులకు చెందిన స్టాల్స్, పలు శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రారంబోత్సవానికి గవర్నర్, ముఖ్యమంత్రి తో పాటు పలువురు ప్రముఖులు, మహిళలలు, సందర్శకులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని సీ ఎస్ ఆదేశించారు. ఈ పర్యటనలో పంచాయతీ రాజనశాఖ కమీషనర్ లోకేష్ కుమార్ , సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర శాసనసభను సందర్శించిన సభాపతి

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

జవహర్ బాలమంచ్ సంస్థ ఆద్వర్యంలో ఎద్యుకేషన్ టూర్ లో భాగంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ ను సందర్శించిన హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాలకు చెందిన 120 మంది విద్యార్థిని, విద్యార్థులు. ఈ సందర్భంగా శాసనసభ పనితీరును విద్యార్థులకు వివరించిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్.చైర్మన్, షాద్ నగర్ శాసనసభ్యులు శ్రీ కే. శంకరయ్య, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, బాలమంచ్ సంస్థ స్టేట్ చైర్మన్ రిషికేశ్ రెడ్డి, సభ్యులు సునీల్ యాదవ్ , సాయికృష్ణలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ గారితో కలిసి గ్రూప్ ఫోటో దిగిన విద్యార్థులు.

# దివ్యాంగులు అన్ని రంగాల్లో సత్తా చాటాలి

**ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుంది: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**దివ్యాంగులు వచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే దానం నాగేందర్**

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. దివ్యాంగులు పట్టుదలతో అన్ని విధాల మరింత ఉన్నతంగా ఎదగాలని మేయర్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా బుధవారం ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్ సి.ఎం.టి.ఐ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, శాసన సభ్యులు దానం నాగేందర్ తో కలిసి పాల్గొని దివ్యాంగులకు ఉపకరణాలు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు తదితరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండి తమ కాళ్ళ మీద తాము జీవించే విధంగా నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకొని అందుకు అనుగుణంగా పట్టుదల, మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. శాసనసభ్యులు దానం నాగేందర్ మాట్లాడుతూ... దివ్యాంగులు ఏ విషయంలోను నిరుత్సాహ పడవద్దని, ఎక్కడా వెనకంజ వేయకుండా స్ఫూర్తి, పోటీతత్వం తో తమ వైకల్యాన్ని అధిగమించి అనుకున్నది సాధించాలన్నారు. ప్రభుత్వపరంగా దివ్యాంగులకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు. యు సి డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ... సభ్య సమాజంలో దివ్యాంగులు ఎవరికి తీసిపోరని, వారిలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, మనోనిబ్బరంతో, ధైర్యంగా ముందుకు వెళ్లి తమ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మహిళా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేసి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించడం తో పాటు జిహెచ్ఎంసి లోని 30 సర్కిల్లో గుర్తించిన 3,619 మంది దివ్యాంగులకు రూ.3.15 కోట్ల విలువగల 7,576 సహాయ పరికరాలు, ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నేడు 81 మంది లబ్ధిదారులకు 99 సహాయ పరికరాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. 16 వీల్ చైర్లు, వీల్ చైర్ విత్ కమోడి ఒకటి, నడవడానికి ఉపయోగించే కర్రలు మీడియం 4, పెద్దవి 8, అడ్జస్టబుల్ ఎల్బో కర్రలు 8, సుగమ్య కేన్ లు 5, హోల్డబుల్ వాకర్ ఒకటి, నీ బ్రేస్ 18, డిజిటల్ వినికిడి పరికరాలు 16, ట్రై సైకిళ్లు 21, బ్రెయిలీ కిట్ ఒకటి పంపిణీ చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని మేయర్ సందర్శించారు. వైద్య శిబిరంలో చేస్తున్న పరీక్షలు, ఇస్తున్న మందులు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, లబ్ధిదారులు, దివ్యాంగులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం

**లబ్దిదారుల ఎంపికకు రంగం సిద్ధం**

**పారదర్శకంగా ఎంపికకు మొబైల్ యాప్**

**రేపు (5వ తేది) గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ**

**6వ తేది నుంచి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ**

**ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్**

**రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాదు, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

తెలంగాణలో నిరుపేదలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న పేదవాడి సొంతింటి కల సాకారం కానుంది. బడుగు బలహీన వర్గాల మహిళలు ఆత్మ గౌరవంతో బతకాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో నీడలేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారుల ఎంపికకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇండ్ల పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అమలుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేసిందని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. "ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం, కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ పేటెంట్. ఈ రోజు కూడా రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా, ఏ తండాకు పోయినా, ఏమారుమూల ప్రాంతానికి పోయినా ఇందిరమ్మ ఇళ్ళే కనబడతాయి. ఈ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు ఒక వంతు అయితే, మేం కట్టించే ఇందిరమ్మ ఇళ్లు మరో వంతు. మేం గర్వంగా చెబుతున్నాం ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తామని చెబుతున్నాం. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి వీలుగా మొబైల్ యాప్‌ను రూపొందించాం. ఈ యాప్‌ను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు గురువారం నాడు ఆవిష్కరించనున్నారు. లబ్దిదారుల ఆర్థిక మరియు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి వివరాలు వంటి అంశాలు ఈ యాప్ లో ప్రధానంగా ఉండనున్నాయి. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను ఏర్పాటు చేశాం.

**ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు..**

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మహిళా పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నాం. ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదారులకు చెల్లింపులు చేస్తాం. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యాలను కలిగి ఉంటాయి. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు ఆవ్యవస్థను రద్దుచేసి లబ్దిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నాం. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతాము.

**ఎన్నికల హామీకి కార్యరూపం..**

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకుంది. మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కర్మాచారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాం.

**హౌసింగ్ శాఖ పునరుద్ధరణ..**

పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంది. 296 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో 2006-2007లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించింది. తెలంగాణ ప్రాంతంలో 2006-2007 నుంచి 2014 వరకు 23,85,188 ఇండ్లను మంజూరు చేయగా 19,32,001 ఇండ్లను పూర్తి చేసింది. 4,53,187 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసింది" అని అన్నారు.

# పరికిపండ్లను అభినందించిన వన్నాల! షామీర్ పేట

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

బిట్స్ ఫిలానీ హైదరాబాద్ క్యాంపస్ సమీపంలోని షామీర్ పేట్ అక్షర వనంలో మద్య ప్రదేశ్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి(ఐఎఎస్)నూతన గృహ ప్రవేశం సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు,బీజేపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ,ఢీంబాయ్ టీవీ సీఈవో, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేత హాజరై లు శాలువ కప్పి,విగ్నేశ్వరుని ప్రతిమ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.గృహ ప్రవేశం సందర్భంగా అందరు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయడం సహజం!కానీ మద్య ప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి గృహప్రవేశం సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అన్నారు.



# గంజాయితో పాటు నగదు స్వాధీనం

**నలుగురిపై కేసు నమోదు, ఇద్దరి అరెస్టు**

**రూ.9 లక్షల జరిమానా**

**చెల్లించిన నిందితురాలు**

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

పత్తెనగర్ వడ్డెర బ స్తీ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు బుధవారం ఎస్ టి ఎఫ్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి టీం కలిసి తనిఖీలు చేపట్టారు. వడ్డెర బస్తీలో ఒక గృహన్ని అద్దెకు తీసుకొని గంజాయి అమ్మకాలు చేపడుతుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద 1.50 కిలోల గంజాయితో పాటు గంజాయి అమ్మకాలు జరిపిన రూ. 17,000 నగద్నాను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ముస్తఫా హెస్సెన్, ఇస్లీ కవితను అరెస్టు చేశారు. వీరిద్దరు ధూల్‌పేట్‌క చెందిన గాయత్రి అనే మహిళ వద్ద రూ.11వేలకు కిలో గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్మకాలు జరుపుతుంటారు. ఇద్దరితోపాటు వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్ లను కూడ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, నగదును పట్టుకున్న కేసులో ధూల్‌పేట్‌కు చెందిన గాయత్రి, వరలక్ష్మీ అలియాస్ వరమ్మపై కేసు నమోదు చేశారు. వీరిద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం గంజాయి అమ్మకాలు జరుపుతు పట్టుబ డిన ఇస్లీ కవితపై గతంలో కూడ గంజాయి కేసులు, తహశీల్దార్ వద్ద బ్కెంవర్ కేసులు ఉన్నాయి. గంజాయి అమ్మకాలు నిలిపి వేయకుండ తరుచు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబ డితున్న కవితపై రూ. తొమ్మిది లక్షల మేర జరిమానా విధించారు. రూ.9 లక్షలను ఈ మధ్యనే జరిమాన రూపంలో వసూలు చేసినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్..ఫయాజుద్దీన్ తెలిపారు. ఈ గంజాయి దాడిలో ఏఈఎస్ మాధ%-%వయ్య, సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు, సత్తారు, సంజయ్ జ్యోతిలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.



www.epaper.samayamdaily.net APTEL/2006/18267 సమయం సామాన్యుల గళం తెలుగు దినపత్రిక

# చెరకు టన్నుకు ధర రూ 4000 బోనస్ వేయి రూపాయలు అందించాలి

**షుగర్ కెన్ కమీషనర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా బోనస్ తోపాటు యాంత్రీకరణ డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ అందించాలి**

**కేంద్ర ప్రభుత్వం చెరకు ధర నిర్ణయం పాత షుగర్ రికవరీ విధానం ఆధారంగా చేయాలి**

**చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు**



**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

రాష్ట్ర ప్రభుత్వం చెరకు టన్నుకు ధర రూ.4,000, మరియు బోనస్ రూ.1000 అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రైతులు షుగర్ కెన్ కమీషనర్ హైదారాబాద్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అదనపు కమీషనర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చెరకు సాగు రైతులకు గిట్టుబాటు కాకపోవడంతో 2014లో 1.5 లక్షల ఎకరాల విస్తీర్ణం నుంచి 30 వేల ఎకరాల విస్తీర్ణం కి తగ్గిపోయిందన్నారు, 2014 లో 11 షుగర్ ఫ్యాక్టరీలు రన్నింగ్ లో ఉంటే నేడు 7 షుగర్ ఫ్యాక్టరీలు రన్నింగ్ లో ఉండి నెల రోజులు కూడా క్రషింగ్ చేసే పరిస్థితి లేదు అన్నారు, 2023-24 క్రషింగ్ సీజన్లో తెలంగాణ రాష్ట్రం లో 17,24,190 టన్నుల చెరకు 7 ఫ్యాక్టరీల్లో క్రషింగ్ అయిందని టన్ను కు రూ1000 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు లోపు ఇస్తే సరిపోతుంది అన్నారు. తెలంగాణ లో చెరకు సాగు ద్వారా చెరకు ఉప ఉత్పత్తులు వలన రాష్ట్ర ప్రభుత్వం కు 1,000 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అన్నారు. అందులో 20 శాతం చెరకు రైతులకు ప్రోత్సాహం కింద తిరిగి బోనస్ రూప లో చెల్లించాలని అన్నారు. చెరకు సాగుకు అవసరమైన యాంత్రీకరణ డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చెరకు ధరకు షుగర్ రికవరీ 8.5 నుంచి 10.25 పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాల చెరకు రైతులకు తీరని ఆర్థిక నష్టం వాటిల్లిందని అన్నారు. 8.5 రికవరీ పద్దతిలో ధర నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చోరవ చేసి దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వాలు సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత చెరకు పరిశ్రమలు మూతపడ్డుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉపాధి అవకాశాలు మరింత దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, మాదినేని రమేష్, డి బాల రెడ్డి, వాసిరెడ్డి ప్రసాద్,చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చా నరసింహారావు, తోటకూర రాజు, యనమద్ది లెనిన్, యనమద్ది రామకృష్ణ, శీలం సత్యనారాయణ రెడ్డి, కళ్యాణపు కృష్ణయ్య, ఐనాల రామలింగేశ్వర రావు, పులి కృష్ణయ్య, మాడపాటి రాజేష్, బి వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు ఒక వ్యక్తి కాదు తెలంగాణ శక్తి

**ఎన్నారై బి.ఆర్.యస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి**



లండన్ : మాజీ మంత్రి హరీష్ రావు గారిపై ప్రభుత్వం అక్రమ కేసు పెట్టడంపై ఎన్నారై బీ.ఆర్.యస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే.. రేవంత్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీశ్‌రావు కేసులు నమోదు చేయడం సరికాదు.ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు అవతలి వ్యక్తి ఎవరూ? వారి చరిత్ర ఏంటి, విశ్వసనీయత ఏంటీ అని పోలీసులు ఆలోచించాలి. చక్రదర్‌గౌడ్ అనే చీటర్ వెళ్లి కేసు పెడితే.. ఎలాంటి ఆధారాలు లేకున్నా హరీశ్‌రావు లాంటి వ్యక్తిపై కేసు నమోదు చేస్తారా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే.. తప్పుడు కేసులు పెట్టడం హాస్యస్పదం. మేము కూడా కేసులు పెడతాం.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా? ముఖ్మమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను బుల్డోజర్లు ఎక్కిస్తాం అని అంటున్నా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, వృద్ధులకు, వికలాంగులు పింఛన్, మహిళలు 2500, కేసీఆర్ కిట్లు, నిరుద్యోగులకు భృతి, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అవన్నీ ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి హరీశ్ ప్రశ్నిస్తే.. వాటికి సమాధానం చెప్పలేక, తప్పుడు కేసులు పెడుతున్నారు. కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండానే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఫోన్ ట్యాపింగ్‌కు హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదు. తక్షణమే మాజీ మంత్రి హరీశ్ రావుపై పెట్టిన బూటకపు కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# స్త్రీ శక్తికి నిదర్శనం ఈ మహిళా కండక్టర్

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**


ఈరోజు ఉదయం ఆరేపల్లి నుండి కామారెడ్డి ఆర్టీసీ బస్సు వస్తున్నప్పుడు బస్సు యొక్క ముంగటి టైర్ పంచర్ అయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అదే బస్సు డ్రైవర్ మరియు మహిళా కండక్టర్ సిహెచ్ భారతి తోటి ప్రయాణికులతో కలిసి టైర్ విప్పదీసి మరొక టైర్ స్టెప్పిని వేయడం జరిగింది. అటుగా రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులు సిహెచ్ భారతిని చూసి ఔర అన్నారు. సిహెచ్ భారతి ని పలువురు అభినందించడం జరిగింది.

# రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాలు

**ఘనంగా జరిగిన ఫారెస్ట్, ఎండోమెంట్ డే కార్యక్రమాలు**

**హైదరాబాద్, డిసెంబర్ 04 (సమయం న్యూస్) :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన "ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు"లలో భాగంగా నేడు ఫారెస్ట్-ఎండోమెంట్ డే ను ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ, దేవాదాయ శాఖ ల ఆద్వర్యంలో రాష్ట్రమంతటా పలు పర్యావరణ, ఆద్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రులు, ప్రముఖులు, అధికారులు, తమ తమ ప్రాంతాలలో అర్బన్ ఫారెస్ట్ లను ప్రారంభించటంతో పాటు స్థానిక ఆధ్యాత్మిక కేంద్రాలలో, గుళ్లలో యాగాలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటవీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులు సంవత్సర కాలంలో సాధించిన విజయాలను, చేరుకున్న లక్ష్యాలను ప్రజలకు వివరించారు. హైదరాబాద్‌లో అటవీ, పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలిసి హైదరాబాద్, కొండాపూర్ లోని శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ %cc% ఎకోటూరిజం డెవలప్మెంట్ కార్యాలయానికి, కొత్తగూడెం-పాల్వంచ, సత్తుపల్లి డివిజనల్ లలో మేనేజర్ ఆఫీస్ కాంపెలక్స్ లను వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం వృక్ష పరిచయ క్షేత్రం, వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ, ఎఆర్ విఆర్ బిల్డింగ్ లను, తెలంగాణ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ నూతన వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవాదాయ శాఖ ఆద్వర్యంలో సుదర్శన గణపతి నవగ్రహ చండీ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో... జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆద్వర్యంలో యాదగిరి గుట్ట దేవాలయంలో సుదర్శన యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాల పల్లి జిల్లాలో..... జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, శాసన సభ్యులు సత్యనారాయణ రావు, జిల్లా ఫారెస్ట్ అధికారి నవీన్ రెడ్డి లు కలిసి ఈ కో పార్క్ ను ప్రారంభించారు. మెదక్ జిల్లాలో.... జిల్లా ఫారెస్ట్ అధికారి జోజి ఆద్వర్యంలో బివిఆర్ టి కశాళాల ఎన్ ఎస్ ఎస్ విధ్యార్థులకు సైకిలింగ్, ట్రెక్కింగ్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, అడవుల ప్రాముఖ్యత ల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



# మెగా( పి.టి.యం.)సమావేశాన్ని జయప్రదం చేయండి

**పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ**





**పత్తికొండ, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

రాష్ట్రవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 7వ తేదీన పత్తికొండ జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో "తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశం" (పిటిఎం) నిర్వహిస్తున్నామని అని తెలిపారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్యాంబాబు కి ఆహ్వాన పత్రిక ఇచ్చి పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ, పాఠశాల చైర్మన్ రామాంజనేయులు, మీరా హుస్సేన్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని లు ఆయన ఆఫీస్ కు వెళ్లి ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానించడం జరిగింది.ఆతర్వాత హెచ్.యం. భ్రమరాంబ పాఠశాల విద్యార్థినులకు ఆహ్వాన పత్రాలు ఇచ్చి వారితల్లి దండ్రులను తప్పకుండా ఈ సమావేశానికి పిలుచుకొని రావాలని చెప్పారు.పిల్లల తల్లిదండ్రులు ఈ మెగా సమావేశంకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.తల్లి తండ్రులు హాజరై,సమావేశంలో పాల్గొని పాఠశాల పురోభివృద్ధికి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు పిల్లల విద్యా ప్రగతికి ,వారి వికాసానికి సహాయ సహకారాలు కూడా అందించాలని కోరారు.

# డిసెంబర్ 7న పేరెంట్స్-టీచర్ మీటింగ్



**పత్తికొండ, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందని, బలంగా విశ్వసించే మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారాచంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాభివృద్ధిలో కూడా సమాజం కీలక భాగస్వామి కావాలన్నదే వారి ప్రధాన ఆకాంక్ష. పేదరికంలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా, ఈ మేరకు విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల మధ్య సంబంధాలను బలపరచడం ద్వారా మన ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి రాబోవు 2047 సంవత్సరాంతానికి వికసిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్(మెగా పిటియం) ని దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించాలని సంకల్పించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల మధ్య వారధిని నిర్మించడానికి, పిల్లల అభ్యాస సామర్థ్యాలను అంచనా వేయడానికి మరియు వారి సమస్యలను గుర్తించడానికి ఈ సమావేశాన్ని డిసెంబర్ 7వ తేదీన నిర్వహించడానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మండలానికి ఒక పాఠశాల చొప్పున ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేశారు ఇందులో పత్తికొండ మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకటి ఈ పాఠశాలలోనే కాకుండా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది కావున విద్యార్థుల యొక్క అందరూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు అందరు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలెను అని పత్తికొండ మండల విద్యాశాఖ అధికారులు తిమ్మారెడ్డి మరియు రమేష్ ద్వారా అందరికీ తెలియజేశారు.

# పుష్ప-2 సినిమాలో శిరివెళ్ల యువకుడికి అవకాశం

**బ్యాక్ గ్రౌండ్ నృత్య కళాకారుడిగా రాణిస్తున్న మందుల శ్రీహరి**

**పలు షోలలో రాణించిన యువకుడు**

**శిరివెళ్ల, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**




మండలకేంద్రమైన శిరివెళ్లకు చెందిన బ్యాక్ గ్రౌండ్ నృత్య కళాకారుడు మందుల శ్రీహరి అనే యువకుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమాలో అవకాశం దక్కించుకున్నాడు. హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో తీసిన పుష్ప-2 మూవీ సాంగ్ లో నృత్య కళాకారుడు పాల్గొన్నాడు. తన ప్రతిభను చాటాడు. అందరి మన్ననలు పొందాడు. గతంలో ఢీ షో తో పాటు పలు రియాలిటీ డ్యాన్స్ షోలలో తాను పాల్గొన్నట్లు యువకుడు తెలిపారు.

www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం
తెలుగు దినపత్రిక



# మళ్లీ భూకంపం వచ్చే అవకాశం : నిపుణులు






**హైదరాబాద్, డిసెంబర్ 4(సమయం న్యూస్):**

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం భూ ప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. ములుగు కేంద్రంగా వచ్చిన ఈ భూకంపం ప్రభావంతో దాదాపు 225 కి.మీ. వ్యాసార్థంతో భూమి 5 సెకండ్ల దాకా కంపించింది. ఈ నేపథ్యంలో భూ ప్రకంపనలకు గల కారణాలపై ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్తలు స్పందించారు. భూకంప తీవ్రత 6 వరకు ఎలాంటి ప్రమాదం లేదని ఎన్‌జీఆర్‌ఐ సైంటిస్ట్ డాక్టర్ శేఖర్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు కామన్ అని చెప్పారు. మళ్లీ భూ ప్రకంపలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే తమ అంచనా ప్రకారం భూ ప్రకంపనల తీవ్రత 6కు మించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. 1969లో భద్రాచలంలో అత్యధికంగా 5.7 తీవ్రతతో నమోదైందని తెలిపారు. భూప్రకంపనలతో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కాగా, గోదావరి పరివాహక ప్రాంతంలో భూ ప్రకంపనలు వచ్చాయని ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపైనే ఎక్కువ ప్రభావం ఉందని పేర్కొన్నారు. నది పరివాహక ప్రాంతాల నుంచి 300 కి.మీ.వరకు భూకంప ప్రభావం ఉంటుందని అన్నారు. అందువల్లే హైదరాబాద్‌లో భూమి కంపించిందని వివరించారు. మళ్లీ భూ ప్రకంపనలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాత భవనాలు, పగుళ్లు వచ్చిన భవనాలను ఖాళీ చేయడం మంచిదని సూచించారు

# ఎమ్మెల్యే కెఈ.శ్యాంబాబును కలిసిన వెలుగు సిబ్బంది







### సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
### ఎమ్మెల్యేకు మెమోరాండం అందజేసిన వెలుగు సిబ్బంది

**పత్తికొండ, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

ప్రభుత్వ విధుల్లో భాగంగా ఎస్ హెచ్ జి ఇన్కమ్ ప్రొఫైల్ సభ్యుల డేటా నమోదు చేయుటకు పత్తికొండ పట్టణంలోనే వెంకట సాయి గ్రామ ఐక్య సంఘం లో ఉన్న గ్రూప్ సభ్యులు వివరాలు తీసుకొనడానికి ఏపిఎం చక్రిధర్ సిసి.శేషప్ప,వివో అధ్యక్షురాలు లక్ష్మీదేవి, వివో ఏ లు సుబ్బలక్ష్మి,వీరమ్మ లతో కలిసి పత్తికొండ పట్టణంలోనే మంగళవారం సాయంత్రం సభ్యులు దగ్గరకు వెళ్లి సభ్యులతో మాట్లాడుతుండగా అదే సమయంలో గతంలో వెంకటేశ్వర పొదుపు గ్రూప్ కు వివోఏలుగా పనిచేసిన నరేంద్ర, పురుషోత్తం,కృష్ణవేణి అయినా కుటుంబ సభ్యులు కలిసి ప్రణాళిక బద్ధంగా విధి నిర్వహణలో ఉన్న సిసి శేషప్పపై దాడి చేశారని బుధవారం స్థానిక శాసనసభ్యులు కేఈ,శ్యాంబాబును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసి మెమోరాండం అందజేశారు,అనంతరం వెలుగు జేఏసీ నాయకులు బి.రాఘవేంద్ర,ఎం రవికుమార్, కృష్ణుడు,ఎం.నరసన్న లు హాజరయై వారు మాట్లాడుతూ సెర్ఫ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తున్న మా సిబ్బందిపై దాడి చేయడం అమానుష్యమని గతంలో వారిని తీసేశారని కక్షతో మా సిబ్బందిపై దాడి చేయడం సిగ్గుచేటుగా ఉందని అన్నారు.వారు ఏదైనా ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలి తప్ప మా సిబ్బందిపై దాడులు చేయడం సరికాదని ఉద్యోగులపై దాడులకు పాలు పడితే జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా వెలుగు సిబ్బంది ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు.కావున స్థానిక ఎమ్మెల్యే వారిపై చర్యలు తీసుకునే మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు..అనంతరం ఎమ్మెల్యే కెఈ.శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విధుల్లో ఉన్నటువంటి సిబ్బందిపై దాడి చేసినటువంటి వారు ఎంతటి వారినైనా ప్రభుత్వం సహించదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఉద్యోగ సిబ్బందికి అండగా ఎప్పుడు మా ప్రభుత్వం ఉంటుందని వెలుగు సిబ్బందికి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది చక్రిదర్, అరుణ, ముద్దురంగడు, జనార్ధన్, రామాంజనేయులు, ఈరన్న,రాజశేఖర్,ధనుంజయ,మహ్మద్,మస్తాన్,అశ్విన్ కుమార్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరారెడ్డిపల్లె పాల సొసైటీ ఎన్నికల్లో విజయ డంక మోగించిన టిడిపి

**శిరివెళ్ల, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీలో బుధవారం జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ డంకా మోగించింది విజయ పాల డైరీ జిల్లా ప్రతినిధులు ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు మధ్య జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సునాయాసంగా విజయం సాధించి తమ అభ్యర్థులను విజయ పతాన నిలుపుకున్నది. వీరారెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఉన్నటువంటి పాల డైరీ సొసైటీ సుదీర్ఘకాలంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసింది ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేయడం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియకి భార్గవ్ రామ్ కి భూమ జగత్ విఖ్యాత రెడ్డి కి శిరివెళ్ల మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి పాల సొసైటీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి తమ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి భూమా అభిమానులకు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి కి పాల సొసైటీ సభ్యులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కొండమడుగుల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ తన పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు.



## ఎవరీ నారాయణ్ సింగ్ చౌరా..?

### సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కాల్పులపై ఘటనపై నిందితుడి గుర్తింపు

**అమృత్‌సర్, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

శిరోమణి అకాలీ దళ్ చీఫ్, పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఓ దుండగుడు ఇవాళ కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. గన్‌తో ఫైర్ చేసిన అతన్ని నారాయణ్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతను మాజీ ఖలిస్తానీ మిలిటెంట్. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద సేవాదార్ విధులు నిర్వర్తిస్తున్న సుఖ్‌బీర్‌పై నారాయణ్ సింగ్ కాల్పులు జరిపాడు. గతంలో అకాల్ ఫెడరేషన్ చీఫ్‌గా చేశాడతను. పాకిస్థాన్‌లో శిక్షణ పొందాడు. సిక్కు తీవ్రవాదంపై పుస్తకాలు రాశాడు. మూడుసార్లు అతను పాకిస్థాన్‌కు వెళ్లాడు. 1995లో అతను ఇండియాకు వచ్చాడు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ హత్య కేసులో చౌరా అనుమానితుడిగా ఉన్నాడు. 2004లో బురెయిల్ జైలు నుంచి పారిపోయిన కేసులోనూ అనుమానితుడిగా ఉన్నాడు. బియాంగ్ సింగ్‌ను హత్య చేసిన బబ్బార్ ఖల్సా ఇంటర్నేషనల్ చీఫ్ గజతార్ సింగ్ హవారాతో పాటు నలుగురు వ్యక్తులు జైలులోని బరాక్ నెంబర్ 7 నుంచి పారిపోయారు. 2004 , జనవరి 21వ తేదీన ఆ ఎస్కేప్ ఘటన చోటుచేసుకున్నది. చౌరాపై మొత్తం 30 కేసులు ఉన్నాయి. 2010 మే 8వ తేదీన అతనిపై ఎక్స్‌ప్లోజివ్స్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. అమృత్‌సర్‌లోని సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసు నమోదైంది. యూఏపీఏ చట్టం కింద కూడా అతనిపై అమృత్‌సర్, తరన్ తారన్, రోపర్‌లో కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2013, ఫిబ్రవరి 28వ తేదీన అతన్ని అరెస్టు చేశారు. తరన్ తారన్ లోని జలాలాబాద్ గ్రామంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత బెయిల్‌పై రిలీజ్ అయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. 1984లో చౌరా పాకిస్థాన్‌కు పారిపోయాడు. సిక్కు తీవ్రవాదం జోరుగా ఉన్న రోజుల్లో అతను భారీ స్థాయిలో ఆయుధాలను, పేలుడు పదార్థాలను స్మగ్లింగ్ చేశాడు. పాకిస్థాన్‌లో ఉన్న సమయంలో నారాయణ్ సింగ్ గెరిల్లా యుద్ధంపై పుస్తకాలు రాశాడు.

## కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం

**తిరువనంతపురం** : కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శబరిమల భక్తులతో వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డజను మందికిపైగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3:45 గంటల ప్రాంతంలో ఆర్యన్‌కావు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న లారీ.. బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన 40 అడుగుల లోతులోకి పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు సేలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో చిన్నారులు, వృద్ధులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## చెక్‌పోస్టులలో ఏసీబీ అధికారుల తనిఖీలు

**హైదరాబాద్, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

రాష్ట్రంలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చెక్‌పోస్టుల్లో 7 ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. లెక్కలు చూపని నగదును ఏసీబీ బృందాలు సీజ్ చేశాయి. విష్ణుపురం చెక్‌పోస్టులో రూ. 86,500, భోరజ్(ఆదిలాబాద్) చెక్‌పోస్టులో రూ. 62,500, అలంపూర్ చెక్‌పోస్టులో రూ. 29,200 సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

## మేడారంలో ప్రకృతి ప్రకోపం

### లక్ష చెట్లు విరిగినా..95 రోజుల్లో భూకంపం

**హైదరాబాద్, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

పచ్చని తాడ్వాయిపై ప్రకృతి కన్నెర్ర చేసినట్లు ఉంది. సుమారు లక్ష చెట్లు కూలిన .. 95 రోజుల్లోనే.. ఆ ప్రాంతం మళ్లీ ప్రకృతి ప్రకోపానికి గురైంది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన వచ్చిన వర్షం, ఈదురుగాలులతో.. మేడారం అడవుల్లో సుమారు 85 వేల చెట్లు కూలాయి. దాంట్లో భారీ వృక్షాలు ఉన్నాయి. సుమారు 50 నుంచి వంద ఏండ్ల నాటి మహావృక్షాలు కూడా ఆ నాటి ప్రకృతి ప్రకోపానికి నేలరాలాయి. అయితే ఇవాళ ఆ ప్రాంతమే కేంద్రంగా భూకంపం సంభవించింది. ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా 5.3 తీవ్రతతో భూమి కంపించింది. భూమిలో సుమారు 40 కిలోమీటర్ల లోతులో భూకంప తీవ్రత నమోదు అయ్యింది. తాడ్వాయి అడవుల్లో ఆగస్టు 31న జరిగిన ప్రకృతి బీభత్సం కారణంగా రూ.152.64 కోట్ల నష్టం వాటిల్లిందని అటవీ అధికారులు ఇటీవల అంచనా వేశారు. ఆ నాటి భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లోని అడవులకు తీవ్ర నష్టం కలిగింది. 332.02 హెక్టార్లలో 85,125 చెట్లు కూలిపోవడమో, విరిగిపోవడమో జరిగిందని అధికారులు డ్రోన్ ఫొటోలు, వీడియోల ద్వారా అంచనా వేశారు. ములుగు జిల్లాలో జరిగిన ప్రకృతి విపత్తుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 11వ తేదీన తన ట్విట్టర్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. సుమారు లక్షకుపైగా చెట్లు మేడారం అడవుల్లో కూలాయని, వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆ ట్వీట్‌లో ఆయన తెలిపారు. ప్రకృతి విపత్తులను అడ్డుకోవాలంటే కలిసికట్టుగా పర్యావరణ సంరక్షణ చేపట్టాలని ఆయన ఆ ట్వీట్‌లో కోరారు. గోదావరి నది సమీపంలో ఉన్న ఈ అటవీ ప్రాంతంపై ప్రకృతి ప్రభావం ఎలా ఉందో శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతానికి సమీపంలోనే బొగ్గు గనులు కూడా ఉన్నాయి. దీంతో భూగర్భ నిపుణులు ఈ ప్రాంత సెసిమిక్ యాక్టివిటీపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## తిరుమలలో ఇన్‌స్టాగ్రామ్ రీల్‌పై నెటిజన్ల ఫైర్



**తిరుమల, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

తిరుమలకు వెళ్లే దారిలో అలిపిరి గేటు వద్ద ఓ యువతి చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ ఇప్పుడు భక్తులకు ఆగ్రహం తెప్పిస్తోంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న పుష్ప 2 సినిమాలోని కిస్సిక్ పాటకు ఓ యువతి అదిరిపోయే స్టెప్పులు వేస్తూ వీడియో చేసింది. ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. సదరు యువతి ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆ రీల్ వెంటనే వైరల్‌గా మారింది. కానీ అది కాస్త భక్తులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. వ్యూస్ కోసం శ్రీవారి సన్నిధిని కూడా వదలడం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యూస్ కోసం ఇలా తిరుమలలో పిచ్చి పిచ్చి వీడియోలు, ప్రాంక్‌లు చేయడం ఎక్కువైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తమిళనాడుకు చెందిన ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ శ్రీవారి క్యూలైన్లలో ప్రాంక్ వీడియో చేశాడు. ఆ తర్వాత మాఢ వీధుల్లో వైసీపీ నేత దివ్వెల మాధురి ఫొటోషూట్ చేయడం దుమారానికి దారి తీసింది. ఇక ఇటీవల తిరుమల మెట్ల మార్గంలో వెళ్తుండగా అదిగో చిరుత అంటూ బిగ్‌బాస్ ఫేమ్, సీరియల్ నటి ప్రియాంక జైన్ చేసిన ప్రాంక్ వీడియో కూడా వివాదాస్పదమైంది. ఇలా ఇటీవల ఇన్‌ఫ్లూయెన్సర్‌లు చేస్తున్న వీడియోలను భక్తులు గుర్తుచేసుకున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మిద్దె కూలి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

**అమరావతి,డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

ఏపీలోని అనంతపురం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున జిల్లాలోని కుందుర్పిలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఒక ఇంటిపై నీరు నిలిచి దెబ్బతింది. దీంతో బుధవారం ఉదయం మిద్దె ఒక్కసారిగా కుప్పకూలడంతో అందులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతులను గంగన్న, శ్రీదేవి, సంధ్యగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

# ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం





**చిన్నారులతో ఆటల పోటీలు నిర్వహణ**

**యు కొత్తపల్లి, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

ఉప్పాడ మండల ప్రజా పరిషత్తు నెంబర్ వన్ స్కూల్లో ప్రపంచ దివ్యంగుల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారులు బి వేణుగోపాల్, మరియు పైడి రాజు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం ఉందని కృంగిపోకుండా విశ్వాసంతో ముందుకు సాగాలని చదువు లో ప్రతిభ చూపాలని తెలిపారు. సమగ్ర శిక్ష దివ్యాంగ పిల్లలకు అనేక సేవలను భవిత సెంటర్ ద్వారా అందిస్తుందని వాటిని మండలంలో గల దివ్యాంగ పేర్లు అందరు కూడా సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. హెచ్ఎం సిహెచ్ విఆర్ మూర్తి మాట్లాడుతూ దివ్యంగా విద్యార్థుల కొరకు గవర్నమెంట్ అనేక ప్రత్యేక పథకాలు రూపొందించిందని పదవ తరగతి ఆ పై చదువులు కొనసాగించవచ్చని తెలియజేశారు .నెంబర్ వన్ స్కూల్ హెచ్ఎం స్వర్ణ కుమారి మాట్లాడుతూ భవిత కు పిల్లలు నిరంతరం పంపించడం వలన మంచి మార్పులు గమనించగలరు అని తెలిపారు. తదుపరి ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పిల్లలకు తల్లిదండ్రులకు సీట్స్,స్నాక్స్ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు లోవరాజు మేరీ మేడం ఇతర ఉపాధ్యాయులు, ఆయా లక్ష్మి తల్లితండ్రులు విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.


## టీఎస్ యుటిఎఫ్ శ్రీరంగాపూర్ మండల నూతన కమిటీ ఎన్నిక




**శ్రీరంగాపూర్/వనపర్తి, డిసెంబర్ 4(సమయం న్యూస్):**

శ్రీరంగాపూర్‌లోని స్థానిక మండల వనరుల కేంద్రం లో బుధవారం మధ్యాహ్నం మండల మహాసభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలం నుంచి భారీగా ఉపాధ్యాయులు హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రవి ప్రసాద్ గౌడ్ హాజరై మాట్లాడుతూ స్కావెంజర్ నిధులు వెంటనే విడుదల చేయాలని,పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలను తక్షణం ప్రకటించాలని, పిఆర్సి రిపోర్టును ప్రకటించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన విధుల నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించి ప్రత్యేక వ్యవస్థ ద్వారా పర్యవేక్షించాలని కోరారు. అనంతరం శ్రీరంగాపురం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఎం. నరసింహ,గౌరవ సలహాదారులుగా,కే. వెంకటస్వామి,ఎస్ శ్రీనివాసులు, అధ్యక్షులుగా కే.కురుమన్న ప్రధాన కార్యదర్శిగా వి చిన్నస్వామి, ఉపాధ్యక్షులు, సి.రమేష్, నస్రిన్ బేగం,కోశాధికారి టి. శ్రావణ్ కుమార్, మండల కార్యదర్శులుగా జే. వెంకటేష్,ఆంజనేయులు, భరత్ కుమార్,హుస్సేన్ మియా,బుచ్చమ్మ,సుజాత, నవీన్,సురేష్ బాబు, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ గా డి. వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కే జ్యోతి వ్యవహరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు టీ. తిమ్మప్ప పి. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర గురుస్వామి ఆధ్వర్యంలో శివ స్వాములు పాదయాత్ర

**ఆలూరు, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**

కిష్టప్ప గురుస్వామి మరియు లక్ష్మీనారాయణ స్వామి ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాల నుండి కార్తీక మాసంలో జలకంటేశ్వర స్వామి ఆలయం నుండి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు మొత్తం 15 మంది స్వాములు ఉదయమే శ్రీ జలకన్టేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకం మరియు అమ్మవారి కుంకుమ అభిషేకం ప్రధాన అర్చకుడు శ్రీ గౌసిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు ఓం ఓం నమః శివాయ.

## మధ్యాహ్నం భోజనం కార్మికులకు మూడు నెలల వేతనాలు ఇవ్వాలి

**నిర్వహణ ఖర్చులు వెంటనే ఇవ్వాలి**

**సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు**

**తుగ్గలి, డిసెంబర్ 04 (సమయం న్యూస్):-**



తుగ్గలి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు వంట కార్మికులకు మూడు నెలల నుండి సొంత డబ్బులు ఖర్చు పెట్టి తమ ఇంట్లో సంసార ఖర్చులు తగ్గించుకొని కుటుంబాలను అతి కష్టం తో గడుపుతున్నారు ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం తెలియనట్లు నటి స్తుందని అన్నారు ఒకపక్క నిత్యవసర ధరలు విపరీతంగా పెరగటం వల్ల మధ్యాహ్న భోజనం కార్మికులు చాలా ఇబ్బందులు పాలవుతున్నారు కావున ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వారు వేతనాలు మరియు వంట నిర్వహణ ఖర్చులు వెంటనే ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు అలాగే కాలం గడిపితే కార్మికులను ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వానికి తెలియజేశారు.

## 'ఏషియా పసిఫిక్ జోన్లో రెండో సెంటర్

**హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్**

**తెలంగాణలో పెట్టుబడులకు కుదిరిన ఒప్పందం**

**గూగుల్‌తో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం**

**సీఎం రేవంత్ నివాసంలో కంపెనీ ప్రతినిధి బృందం భేటీ**

**డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజ**

**గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా ఉంది**

**ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ హైదరాబాద్ మేటి**

**ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

తెలంగాణ ప్రభుత్వం దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ ముందుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ని హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది కాగా, ఏషియా పసిఫిక్ జోన్లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ కావడం విశేషం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ అనేది ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్ . ఈ సేఫ్టీ సెంటర్ అధునాతన భద్రతతో పాటు ఆన్‌లైన్ సేఫ్టీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, రీసెర్చర్లకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా మారనుంది. భారతదేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ సేఫ్టీ సెంటర్ పని చేస్తుంది. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ సంస్థ అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ లో నిర్మిస్తోందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ 3న జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు దేశంలోని పలు రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. దాంతో హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. ఈ సేఫ్టీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో హైదరాబాద్ మరోసారి ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం బుధవారం జూబ్లీహిల్స్ లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని ఈ సందర్భంగా హాన్సెన్ అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో అయిదు ఫేమస్ టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఅ పరిష్కరించే వీలుంటుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని' చెప్పారు. హైదరాబాద్ లో భారతదేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను స్థాపించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని గూగుల్ సీఐఓ కలిశారు. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేసే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ హైదరాబాద్ లో స్థాపించడం గమనార్హం. ఈ సెంటర్ అధునాతన భద్రత, ఆన్లైన్ భద్రత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవల యూఎస్ఏ లోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన సందర్భంగా అక్కడ గూగుల్ సమస్త ప్రతినిధులతో పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. హైదరాబాద్ నగరంలో జిఎస్ఈసిని ఏర్పాటు చేసేందుకు, గూగుల్ ముందుకు రావడం తనకు గర్వంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. గూగుల్ తో జరిగిన ఒప్పందంతో డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవకాశం ఉంటుందని, సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాలలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన అయిదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఅ పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు

**సంభల్‌కు బయల్దేరిన రాహుల్, ప్రియాంక గాంధీ**

**అడ్డుకున్న పోలీసులు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ లో న్యాయస్థానం ఆదేశాల మేరకు ఓ ప్రార్థనా మందిరంలో సర్వే చేస్తుండగా అల్లర్లు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ అల్లర్లలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం సంభల్‌కు బయల్దేరారు. అయితే, వారిని ఘాజీపూర్ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను వారి వాహనాలకు అడ్డుపెట్టారు. సంభల్ వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కారు దిగి పోలీసులతో మాట్లాడినప్పటికీ వారు ఎలాంటి అనుమతీ ఇవ్వలేదు. చేసేదేమీ లేక రాహుల్, ప్రియాంక సరిహద్దు వద్దే వెనక్కి తిరిగారు. ఢిల్లీకి బయల్దేరారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. మేము సంభల్‌కు వెళ్లాలనుకున్నాం.. కానీ పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. 'సంభల్ వెళ్లేందుకు పోలీసులు మమ్మల్ని అనుమతించడం లేదు. అక్కడికి వెళ్ళడం నా హక్కు. కానీ వారు నన్ను అడ్డుకుంటున్నారు. సంభల్ వెళ్లి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం. అక్కడ ఏం జరుగుతోందో చూడాలనుకుంటున్నాం. కానీ మమ్మల్ని అక్కడికి వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకుంటున్నారు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంభల్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై ప్రియాంక గాంధీ స్పందించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత అని, ఆయనకు రాజ్యాంగపరమైన హక్కులు ఉన్నాయన్నారు. ఆయన్ని అడ్డుకోవడం సరికాదన్నారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి

**గవర్నర్‌ను కోరిన ఫడ్నవీస్ బృందం**



**ముంబై, డిసెంబర్ 4 (సమయం న్యూస్):**

మహారాష్ట్రలో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడి 11 రోజులైనా సీఎం ఎంపికపై పీటముడి వీడకపోవడంతో సస్పెన్స్ కొనసాగింది. చివరకు సీఎం ఎంపికపై మహాయుతి కూటమిలోని మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బుధవారం ఉదయం బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై దేవేంద్ర ఫడ్నవీస్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంది. మధ్యాహ్నం దేవేంద్ర ఫడ్నవీస్.. కూటమిలోని శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్‌లతో కలిసి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి తమను ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వానించాలని కోరారు. తమకు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం ఉన్నదని చెప్పారు. కాగా దేవేంద్ర ఫడ్నవీస్ రేపు (నవంబర్ 4న) సాయంత్రం దక్షిణ ముంబైలోని అజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఇద్దరూ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితరులు హాజరుకానున్నారు.

# లక్నో కెప్టెన్సీ రేసులో రిషభ్ పంత్







ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ ఎవరనే దానిపై ఊహగానాలు చెలరేగుతున్నాయి. అయితే వేలంతో అత్యధిక ధర పెట్టి రిషభ్ పంత్ (రూ.27 కోట్లు)ను కోనుగోలు చేసిన ఫ్రాంచైజీ.. అతడినే కెప్టెన్ గా చేసే అవకాశముందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయంపై తాజాగా లక్నో యజమాని సంజీవ్ గోయెంకా మనసు విప్పారు. కెప్టెన్సీ విషయంలో అందరూ ఊహిస్తున్న విధంగానే ఉంటుందని, ఎలాంటి సర్ప్రైజ్ లు ఉండబోవని గోయెంకా పేర్కొనారు. ఈనెల మొదటి, రెండు వారం ముగిసేలోపల సారథి నియామకం ఉంటుందని తెలిపారు. మరోవైపు మెగావేలంలో దాదాపుగా తాము అనుకున్నట్లే కొనుగోలు చేశామని తెలిపారు. పంత్ ను దక్కించుకోవడం కోసం ప్రత్యేక వ్యూహాన్ని రూపొందిచుకున్నామని తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ్ జిందాల్ కి పంత్ తో స్నేహ సంబంధాలున్నాయని, అతడిని దక్కించుకోవడం కోసం జిందాల్ వేలంలో ఎంతవరకైనా వెళతారని ఊహించానని పేర్కొన్నారు. అప్పటికే శ్రేయస్ అయ్యర్ ను 26.75 కోట్లకు జిందాల్ కొనుగోలు చేయడంతో.. రైట్ టూ మ్యాచ్ సందర్భంగా రూ.27 కోట్ల ధరను పంత్ కు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరోవైపు పంత్ తమ ఫ్రాంచైజీతో మరో 10-12 ఏళ్లుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సీజన్ లో ఐడెన్ మార్క్రమ్ (దక్షిణాఫ్రికా), మిచెల్ మార్ష్ (ఆస్ట్రేలియా)లలో ఒకరితో కలిసి పంత్ ఓపెనింగ్ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వేలంలో ముఖ్యంగా లక్నో మిడిలార్డర్ భారత ఆటగాళ్లతో నింపాలని వ్యూహాన్ని రచించుకున్నట్లు తెలిపారు. మరోవైపు వేలంలో తమ ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జట్టు సమతూకంగా ఉందని, మరే జట్టు ఇంత బలంగా లేదని తెలిపారు. ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లు ఉన్నారు. అలాగే పేస్ బౌలింగ్ కూడా సమర్థులైన భారత ప్లేయర్లతో నిండి ఉందని వ్యాఖ్యానించారు. తమ టీంలో నలుగురు లీడర్లు ఉన్నారని, రిషభ్ పంత్, మార్క్రమ్‌బీ మార్ష్, పూరన్.. వీరంతా గెలవాలనే తపన కలిగి ఉన్నారని తెలిపారు. ఇక వేలం ముగిసిందని, జట్టు కూర్పు గురించి టీమ్ డైరెక్టర్లు జహీర్ ఖాన్, కోచ్ జస్టిన్ లాంగర్ చూసుకుంటారని వివరించారు. గత సీజన్ లో లక్నోకు కేఎల్ రాహుల్ కెప్టెన్ గా వహించగా.. టీం లీగ్ దశకే పరిమితమైంది.

## అండర్ 19 ఆసియాకప్ 2024లో టీమిండియా ఘన విజయం!

**వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్**



అండర్ 19 ఆసియాకప్ 2024లో భారత్ మరో విజయాన్ని సాధించింది. యూఏఈతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో గెలిచిన భారత అండర్ 19 టీమ్.. సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గ్రూప్-ఏలో పాకిస్థాన్, యూఏఈ, జపాన్‌తో ఉన్న భారత్.. 3 మ్యాచ్‌ల్లో రెండు గెలిచి టేబుల్ రన్నరప్‌గా సెమీఫైనల్ చేరింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ(46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకు కుప్పకూలింది. ముహమ్మద్ రయన్(35) మినహా అంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో యుధజిత్ గుహ మూడు వికెట్లు తీయగా.. చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. కేపీ కార్తికేయ, ఆయుష్ మాత్రే తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 16.1 ఓవర్లలో 143 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు ఆయుష్ మాత్రే(51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 67 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 6 సిక్సర్లతో అలరించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 1.10 కోట్లు పలికి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. ఈ టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఒక్క పరుగే చేసిన ఈ చోటా సూరీడు.. జపాన్‌తో 23 పరుగులకే వెనుదిరిగాడు. మూడో మ్యాచ్‌లో మాత్రం తన అసలు సిసలు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు.రాజస్థాన్ రాయల్స్ ఈ చోటీ సూరీడుని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. 13 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాడిగా ఈ బీహార్ కుర్రాడు రికార్డ్ సాధించాడు. అంతేకాకుండా అండర్ 19 క్రికెట్ చరిత్రలోనే అతి పిన్నవయస్కుడిగా కూడా నిలిచాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. డిసెంబర్ 10న దుబాయ్ వేదికగా ఫైనల్ జరగనుంది.

## తుది జట్టులో అవకాశం దక్కితే చాలు

**బ్యాటింగ్ స్థానంపై ఆలోచించడం లేదు**
**జట్టు ప్రయోజనాల కోసం ఏ స్థానంలోనైనా ఆడుతా**
**జట్టును గెలిపించేందుకు ప్రయత్నిస్తా**
**కెరీర్‌లో వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేశాను**
**కేఎల్ రాహుల్ కీలక వ్యాఖ్యలు**

బ్యాటింగ్ స్థానంపై ఆలోచించడం లేదని, తుది జట్టులో అవకాశం దక్కితే చాలనుకుంటున్నానని టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పింక్ బాల్ టెస్ట్‌లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో 295 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన టీమిండియా.. పింక్ బాల్ టెస్ట్‌లోనూ అదే జోరు కొనసాగించాలనుకుంటోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులోకి వచ్చాడు. రోహిత్ శర్మ గైర్హాజరీలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు కఠినంగా ఉన్న పరిస్థితుల్లో 70కి పైగా బంతులు ఎదుర్కొని 26 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 77 పరుగులతో రాణించాడు. కాన్‌బెరా వేదికగా ప్రెసిడెంట్ ఎలెవెన్‌తో జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో రోహిత్ శర్మ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. దాంతో అడిలైడ్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఓపెనర్‌గా ఎవరు? ఆడుతారా? అనేది సందేహంగా మారింది. ఈ మ్యాచ్ నేపథ్యంలో బుధవారం మీడియాతో మాట్లాడిన కేఎల్ రాహుల్‌ను ఇదే విషయంపై ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నాకు తుది జట్టులో చోటు దక్కడమే ముఖ్యం. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కడైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాను. జట్టు ప్రయోజనాల కోసం ఏ స్థానంలోనైనా ఆడుతా. ఓపెనర్‌గా అయినా.. మిడిలార్డర్‌లో ఆడినా జట్టును గెలిపించేందుకు ప్రయత్నిస్తాను. ఇప్పటి వరకు నా కెరీర్‌లో వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేశాను. మొదట్లో కాస్త కష్టంగా ఉండేది. టెక్నిక్ పరంగా కాకుండా.. మానసికంగా కాస్త ఇబ్బంది పడేవాడిని. తొలి 20-25 బంతులు కష్టంగా అనిపించేది. ఇప్పటికీ చాలా సార్లు నేను టెస్ట్‌ల్లో.. వన్డేల్లో విభిన్నమైన స్థానాల్లో బ్యాటింగ్ చేశాను. దాంతో కాస్త మార్పు వచ్చింది. ఇప్పుడు ఏ స్థానంలో ఆడాలో నాకు క్లారిటీ ఉంది. తొలి 30-40 బంతులు ఆడగలిగితే.. నా శైలిలో బ్యాటింగ్ చేయడం సులువవుతోంది.నేను పరిస్థితులను అందిపుచ్చుకొని పరుగులు చేసేందుకు ప్రయత్నిస్తాను. నా బ్యాటింగ్ పొజిషన్‌పై టీమ్‌మేనేజ్‌మెంట్ నాకు క్లారిటీ ఇచ్చింది. కానీ ఇప్పుడు నా బ్యాటింగ్ స్థానం ఏంటో చెప్పలేను. మీరు తొలి రోజు ఆట వరకు ఆగాల్సిందే. రేపు కెప్టెన్ రోహిత్ శర్మ మీడియా సమావేశానికి వస్తాడు.'అని కేఎల్ రాహుల్ తెలిపాడు.



# టీమిండియా గోల్డెన్ ఆర్మ్ బుమ్రా




ఒకప్పుడు టీమిండియా ఆడుతుందంటే కేవలం బ్యాటర్లను మాత్రమే చూసే కళ్లు... ఇప్పుడు ఆ బౌలర్ కోసం వెతుకుతున్నాయి. ఒకప్పుడు ఓ బ్యాటర్ వచ్చి భారీ సెంచరీ చేసి జట్టును గెలిపిస్తాడులే అని భావించే అభిమానులు... ఇప్పుడు ఆ బౌలర్ ఉంటే చాలు ఎలాగైనా గెలిచేస్తామనే నమ్మకానికి వచ్చేశారు. ఒకప్పుడు బ్యాటర్లను స్టార్లుగా చూసే క్రీడా ప్రేమికులు.. ఇప్పుడు ఈ బౌలింగ్ స్టార్ ను చూసి ఉబ్బితబ్బిబయిపోతున్నారు. ఒకప్పుడు పేస్ పిచ్ చేయాలంటే భయపడే భారత క్యూరేటర్లు.. ఇప్పుడు అతడున్నాడనే ధైర్యంతో నిర్భయంగా పేస్ పిచ్ లను తయారు చేస్తున్నాడు.. ఈ పాటికే మీకు అర్థమై పోయి ఉంటుంది. మనం ఎవరి గురించి మాట్లాడుకుంటున్నామో.. అతనే టీమిండియా స్టార్ పేసర్, పేసు గుర్రం జస్ప్రీత్ బుమ్రా( . బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కెప్టెన్ గా.. టీమిండియా పేసర్ గా బుమ్రా రాణించిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుమ్రా లాంటి బౌలర్ మాకు ఉంటే బాగుండు అని ఆస్ట్రేలియా క్రికెటర్లు మాట్లాడుకునే స్థాయికి ఇప్పుడు బుమ్రా ఎదిగేశాడు. " ఇలాంటి మనిషి ఒకడు ఇలా తరంపై నడయాడిన సంగతి.. నమ్మరాదని నమ్మకముందే ముందు తరాలకు చెప్పండి" అని మహాత్మ గాంధీ గురించి అల్బర్ట్ ఐన్ స్టీన్ వ్యాఖ్యానించాడు. ఇప్పుడు కాస్త అటుఇటుగా.. ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. " తన క్రికెట్ ప్రయాణం ముగిశాక బుమ్రా లాంటి గొప్ప బౌలర్ ను తాను చూశానని.. అతనితో కలిసి క్రికెట్ ఆడానని నా మనవళ్లకు చెప్పుకుంటా" ట్రావిస్ హెడ్ వ్యాఖ్యానించాడు. "క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప బౌలర్లలో ఒకడిగా బుమ్రా తన కెరీర్‌ను ముగిస్తాడు. అతడ్ని ఎదుర్కోవడం ఓ బిగ్ ఛాలెంజ్. అయినా సరే బుమ్రాతో క్రికెట్ ఆడడం నాకు చాలా బాగుంది. బుమ్రాను ఇంకా ఎక్కువసార్లు ఎదుర్కోవాలి. " అని హెడ్ అన్నాడు. మరో క్రికెటర్ స్టీవ్ స్మిత్ కూడా ఇదే అన్నాడు. "బుమ్రాతో కలిసి ఇప్పటికే చాలా మ్యాచులు ఆడా. చాలాసార్లు బుమ్రా బౌలింగ్ నూ కూడా ఎదుర్కొన్నా. కానీ నేను ఎదుర్కొన్న ప్రతీసారి బుమ్రా నాకు కొత్తగానే కనిపిస్తాడు. అతడి బౌలింగ్ ఎదుర్కోవడం ప్రతిసారీ సవాలుగా అనిపిస్తుంది. అతడి బౌలింగ్ శైలి నాకు అస్సలు అంతుచిక్కదు" అని స్టీవ్ స్మిత్ ఇటీవల కామెంట్లు చేశాడు. పెర్త్ టెస్టులో అద్భుత బౌలింగ్?తో టీమిండియాకు బుమ్రా విజయాన్ని అందించాడు. బుమ్రా బౌలింగ్ ను ఎదుర్కోలేక తమ బ్యాటర్లు కకావికలమవుతుంటే కొందరు ఆస్ట్రేలియా అభిమానులు.. బుమ్రా చెకింగ్ చేస్తున్నాడని చిల్లర ఆరోపణలు కూడా చేశారు. కానీ ఇవేమీ బుమ్రా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బకొట్టలేదు. కంగారు గడ్డపై కంగారులను కంగారు పెట్టి భారత్ కు బుమ్రా ఘన విజయం అందించాడు. తొలి టెస్టులో ఆస్ట్రేలియాను 295 పరుగులతో టీమిండియా చిత్తు చేసిందంటే అది బుమ్రా ఘనతే. ఇక డిసెంబర్ ఆరు నుంచి రెండో టెస్టు జరగనుంది. అడిలైడ్ వేదికగా జరిగి ఈ టెస్టు మ్యాచ డే అండ్ నైట్ జరగనుంది. ఈ పింక్ బాల్ టెస్టులో కంగారు బ్యాటర్లకు బుమ్రా నుంచి ముప్పు పొంచి ఉంటుందని మాజీ క్రికెటర్లు అంచనా వేస్తున్నారు. బుమ్రా బంతులను ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆసిస్ బ్యాటర్లు తలలు పట్టుకుంటున్నారట. బుమ్రా బంతులను ఎలా ఎదుర్కోవాలనే దానిపైనే కంగారుల ప్రణాళికలన్నీ తిరుగుతున్నాయన్న టాక్ క్రికెట్ వర్గాల్లో వినిపిస్తోంది.


www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం తెలుగు దినపత్రిక

# శోభిత.. చైతూ పెళ్లికి

## గెస్ట్ లిస్ట్‌లో ఉన్నది వీరే...!

అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆయన పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం ఇవాళ నటి శోభితతో జరగనున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్‌లో వీరి వివాహం పూర్తి సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. దాదాపు 8 గంటలపాటు పెళ్లి తంతు జరగనున్నట్లు తెలిసింది. ఇక ఈ వేడుకకు అక్కినేని, దగ్గుబాటి కుటుంబాలతోపాటు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరుకానున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ఈ వేడుకకు హాజరుకాబోతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా అగ్ర కథానాయకులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్..ఉపాసన, మహేశ్ బాబు..నమ్రత, ప్రభాస్, లేడీ సూపర్ స్టార్ నయనతార, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సహా పలువురు అగ్ర తారలు, దర్శకులు హాజరుకానున్నారు. పెళ్లి వేడుకలో భాగంగా ఇటీవలే కాబోయే కొత్త జంటకు హల్దీ వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. చై-శోభిత జంటను ఒకేచోట ఉంచి మంగళస్నానాలు చేయించారు. అనంతరం శోభితను పెళ్లి కూతురిగా ముస్తాబు చేసి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎరుపు రంగు చీరలో శోభిత మెరిసిపోతున్న ఫొటోలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఇక పెళ్లిలో శోభిత బంగారు జరీ వర్క్‌తో కూడిన కాంచీవరం చీరను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. కాబోయే కోడలికి నాగార్జున ఖరీదైన కారు బహుమతిగా ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ఇటీవలే నాగ్ రూ.2.75 కోట్లతో లెక్సస్ లగ్జరీ కారును కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ కారును కొడుకు, కోడలికి గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నట్లు సమాచారం. దీంతోపాటు బంగారు ఆభరణాలు ఇలా ఖరీదైన బహుమతులు శోభిత కోసం సిద్ధం చేసినట్లు టాలీవుడ్ సర్కిల్ నుంచి టాక్.





# తుది దశకు చేరిన 'ది గర్ల్ ఫ్రెండ్'



## చిత్రటీంకు సుకుమార్ శుభాకాంక్షలు

రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్‌శెట్టి కథానాయకుడు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నారు. రీసెంట్‌గా టీజర్ చూసిన అగ్ర దర్శకుడు సుకుమార్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రష్మిక క్లోజప్ షాట్స్, ఆమె హావభావాలు బాగున్నాయని, దర్శకుడు సరైన యాక్టర్స్‌ని సెలక్ట్ చేసుకున్నాడని సుకుమార్ అభినందించారు. ఈ చిత్రానికి కెమెరా.. కృష్ణన్ వసంత్, సంగీతం.. హేషమ్ అబ్దుల్ వాహబ్, సమర్పణ..అల్లు అరవింద్, నిర్మాణం.. గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటైర్టైన్మెంట్స్. ఇదిలావుంటే.. రష్మిక నటించిన తాజా చిత్రం 'పుష్ప-2' ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఆమె హిందీలో ఛావా, సికందర్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# నెత్తుటి పిడికిలి బిగించిన చిరంజీవి

## శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్



ప్రస్తుతం విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి. సోషియా ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగా.. మరోవైపు దసరా ఫేం శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. అలా అప్‌డేట్ ఇచ్చేశారో లేదో..? సినిమా ఉండబోతుందోనని ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న అభిమానులకు స్టన్నింగ్ ఫొటోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.మెగాస్టార్ చిరంజీవితో పిడికిలి బిగించిన స్టిల్‌ను షేర్ చేశాడు. బ్యాక్‌డ్రాప్‌లో చిరు, శ్రీకాంత్ ముఖాలను కనిపించకుండా.. నెత్తుటితో పిడికిలి బిగించిన స్టిల్‌ను హైలెట్ చేస్తూ తీసిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. సినిమా వయోలెన్స్‌గా (హింసాత్మకంగా) ఉండబోతుందని ట్వీట్ చేశాడు. ఒక్క స్టిల్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. శ్రీకాంత్ ఓదెల ఓ వైపు నానితో రెండో సినిమాను డైరెక్ట్ చేస్తూనే.. మరోవైపు మెగాస్టార్ సినిమాను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టులో చిరంజీవిని చాలా ఫ్రెష్ లుక్‌తో నయా అవతార్‌లో చూపించబోతున్నాడట.

# ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా..

## పవన్‌తో డైరెక్టర్ సుజిత్ ఓజీ సినిమా

ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా.. పోకిరి సినిమాలోని ఈ డైలాగ్ ఎంత పాపులర్ అయ్యిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా రోజుల తర్వాత ఈ డైలాగ్‌ను మరోసారి గుర్తు చేస్తున్నాడు యంగ్ డైరెక్టర్ సుజిత్. ఏ సినిమా అప్‌డేట్ అయినా షేర్ చేసే ప్లాట్‌ఫాంలలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది సోషల్ మీడియా. ఇటీవల కాలంలో సాధారణంగా హీరోలు, డైరెక్టర్లు తమ తమ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను నెట్టింట షేర్ చేస్తూ అభిమానులను ఖుషీ చేస్తుంటారని తెలిసిందే. అయితే నెట్టింట (ఎక్స్‌లో)అకౌంట్ లేకున్నా సూపర్ క్రేజ్ ఉన్న అతికొద్ది యువదర్శకుల్లో టాప్‌లో ఉంటాడు సుజిత్. రన్ రాజా రన్ సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ తెలుగు దర్శకుడు ప్రభాస్‌తో సాహో తెరకెక్కించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు. ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో ఓజీ తెరకెక్కిస్తూ హాట్ టాపిక్‌గా నిలుస్తున్నాడు. మొత్తానికి ఫైనల్‌గా అభిమానులతో నేరుగా టచ్‌లోకి వచ్చేందుకు ట్విటర్‌లోకి ఎంట్రీ ఇచ్చేశాడు సుజిత్. ఎక్స్ అకౌంట్ కవర్‌ఫొటోపై ఓజీ స్టిల్‌ను పెట్టుకొని అభిమానుల్లో నయా జోష్ నింపుతున్నాడు సుజిత్. ఈ సందర్భంగా సుజిత్‌కు గ్రాండ్ వెల్‌కమ్ చెబుతున్నారు మూవీ లవర్స్, నెటిజన్లు. ఇంతకీ ఎక్స్ ఖాతాలో సుజిత్ ఫస్ట్ పోస్ట్ ఏం పెడతాడన్నది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశాడు. ఇదిలా ఉంటే మరోవైపు ఓజీ సినిమాతో ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా.. బుల్లెట్టు దిగిందా లేదా అనే డైలాగ్‌ను ఫుల్ ఫిల్ చేస్తాడని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్.



# జాట్ మాస్ట్ ఫీస్ట్

## గోపీచంద్, సన్నిడియోల్ ఇంట్రెస్ట్ న్యూస్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని బీటౌన్ డెబ్యూ ఇస్తున్నాడని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా ఎస్‌డీజీఎంగా రాబోతున్న ఈ చిత్రానికి జాట్ టైటిల్‌ను ఫైనల్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఇప్పటికే మాస్ ఫీస్ట్ లోడింగ్ అంటూ మేకర్స్ లాంచ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. బుధవారం సాయత్రం 4:05 గంటలకు ఎక్జయిటింగ్, భారీ అనౌన్స్‌మెంట్ అంటూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బీటౌన్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. రిషి పంజాబి సినిటోగ్రాఫర్ కాగా.. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు.




Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek art printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10,GROUND FLOUR budha bhavan m.g.road secundrabad 03. Ali publicacstion Hyderabad, www.samayam.net.
Mobile no. 98660 19778, 89789 60131.